క్లుప్తంగా

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న జగన్నాథుడు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథ యాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక సంతపేట, దాసన్నపేటలో కొలువైన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ నెల 28న ఉదయం 8 గంటలకు సంతపేట జగన్నాథస్వామి ఆలయంలోను.. 9 గంటలకు దాసన్నపేట జగన్నాథస్వామి ఆలయంలో మారు రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.

సమాన పనికి సమాన వేతనం



డీఎంహెచ్‌ఓ భాస్కరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: నేషనల్ హెల్త్ మిషన్‌లో (ఎన్‌హెచ్‌ఎం) పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అస్సాం రాష్ట్రాల్లో రెగ్యులర్ చేశారన్నారు. మన రాష్ట్రంలో కూడా రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, ఇందిరా, శ్రీలత, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదర్శ పాఠశాలలోని 7, 8, 9 తరగతుల్లో మిగుల సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28 లోగా పాఠశాలకు నేరుగా వచ్చి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న అశోక్



అమ్మవారిని దర్శించుకుంటున్న అశోక్ దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'పై సమావేశం

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో జగనన్న సురక్ష పథకంపై మంగళవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ స్వరూపారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు నిర్వహించనున్న సమావేశానికి ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన



గుంకలాంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరావు

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం, బడుకొండపేట గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గంటా వెంకటరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడారు. వేతనదారుల హాజరు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ మండల గౌరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్వర్ణయుగం..

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు



భోగాపురం: లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు స్వర్ణయుగాన్ని చూస్తున్నారని, మరో 50 సంవత్సరాలు ఆయనే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముక్కాంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాలను వివరిస్తూ, ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు పేదలకు ఒక్క మేలు కూడా చేయలేదన్నారు. బాబు హయంలో విద్య, వైద్యం, రాజకీయం, వ్యాపారం అంతా కార్పొరేట్ శక్తుల కనుసన్నలలో నడిచిందని ఆరోపించారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాలకు ఎనలేని ప్రాధాన్యం కల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పాటు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణీ చేసి కార్పొరేట్‌స్థాయికి అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రజలు పక్క రాష్ట్రాల్లో కూడా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 175కి 175 సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, వాసుపల్లి రెయ్యుడు, మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు, సుందర హరీష్, కొల్లు రామ్మూర్తి, అప్పర భుక్త పైడినాయుడు, కర్రోతు శ్రీనివాసరావు, కిలారి వెంకటరమణ, పూడిక నూకరాజు, పోతిరెడ్డి గోపి, నక్క అప్పలనర్సి, దాసరి అప్పలస్వామి, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని.. అందుకే ప్రజలంతా సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్ పరిధి అయ్యకోనేరు ప్రాంతం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తూ బుక్‌లెట్లు అందించారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జోనల్ ఇన్‌చార్జ్ గుజ్జల నారాయణరావుతో కలిసి ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, అవి లబ్ధిదారులకు సక్రమంగా చేరుతున్నాయో, లేదో తెలుసుకోవాలనుకోవడం గొప్ప విషయమన్నారు. నియోజకవర్గంలో శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో ఇటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అటు అభివృద్ధి పనులు కూడా త్వరితగతిన జరుగుతున్నాయని చెప్పారు. డివిజన్ పరిధిలోని ఇస్మాయిల్ కాలనీ, గోశాల, సుంకరవీధి, తదితర ప్రాంతాల్లో కార్యక్రమం సాగింది. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ షకీల్, నాయకులు పిలకా శ్రీను, లంక మధు, వెంపడాపు శ్రీనివాస్, చిన్ని రవి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఇరువురిపై ఉందన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు, మండలశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

- సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగమణి

డెంకాడ: మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వల్ల తీవ్ర అనర్థాలు ఎదుర్కొంటారని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కె.నాగమణి అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత ఆధునిక పోకడల పేరుతో లేనిపోని చెడు అలవాట్లను అలవరుచుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనమవుతుందని తెలిపారు. యువత మంచి మార్గంలో నడవాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ జి.దుర్గయ్య, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి, సీఐలు ఎస్.రాజేశ్వరి, కేకే విజయనాథ్, కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరం..

భోగాపురం: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఎస్సై రామకృష్ణ సూచించారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా స్థానిక జాతీయ రహదారిపై అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మాదక ద్రవ్యాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు.. అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం, సారా, గంజాయి తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. యువత చెడు వ్యసనాలబారిన పడకుండా తల్లిదండ్రులు, గురువులు సూచించిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ టి.ఎస్తేర్‌రాణి, సూపర్‌వైజర్ శాంతిలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.



భోగాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఈబీ సిబ్బంది

మత్తుతో బతుకులు చిత్తు..

నెల్లిమర్ల: మత్తుతో యువత బతుకులు చిత్తవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్.రాజశేఖరనాయుడు అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఈబీ ఆధ్వర్యంలో నెల్లిమర్ల పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొయిద జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక చక్ర కళాశాల, సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాగ్ అందజేత

నెల్లిమర్ల: ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను సంబంధిత మహిళకు నెల్లిమర్ల పోలీసులు అందజేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 23వ తేదీన నెల్లిమర్ల పట్టణంలో ఆటోలో ప్రయాణిస్తూ తన వెంట తీసుకొచ్చిన బ్యాగ్ మరిచిపోయి ఆటో దిగిపోయింది. బ్యాగ్‌లో సదరు మహిళ కూతురికి చెందిన సర్టిఫికెట్లు, విలువైన సామాన్లు ఉన్నాయి. మురుచటి రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై పి. నారాయణరావు స్పందించి ఆటోను పట్టుకుని బ్యాగ్‌ను బాధిత మహిళకు అందజేశారు.

'జగనన్నకు చెబుదాం'లో రెండు వినతులు

విజయనగరం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వివిధ సమస్యలపై రెండు వినతులు అందాయని పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మీటింగ్ హాల్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆధునీకరించిన మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు సోమవారం ప్రారంభించారు. ఈ హాల్‌ను రూ. 7.9 లక్షలతో ఆధునీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబరు అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అధికారులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా అధికారులంతా గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కౌలురైతులను గుర్తించి, వారందరికీ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులను ఇప్పటికే సిద్ధంగా ఉంచామని ఏఓ పూర్ణిమ తెలిపారు. అలాగే కౌలురైతుల గుర్తింపు కార్యక్రమం చురుగ్గా జరుగుతోందన్నారు. మండల వ్యాప్తంగా 4600 ఎకరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. దేవదాయ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలని సీతారామునిపేట, గొర్లిపేట సర్పంచ్‌లు కోరారు. ఇప్పటికే సంబంధిత ప్రతిపాదనలు పంపించినట్లు ఏఓ తెలిపారు.

రేషన్ కార్డుల సవరణకు అవకాశం

జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో రేషన్ కార్డుల సవరణకు అవకాశం కల్పించినట్లు రెవెన్యూ అధికారులు సమావేశంలో వెల్లడించారు. కార్డుల్లో పేర్ల చేర్పులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. ఉపాధి హామీ పథకం పనులపై ప్రతి ఏటా సామాజిక తనిఖీలు ఉంటాయని ఏపీఓ అరుణ తెలిపారు. తమ గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని, శిథిలమైన స్తంభాలను మార్చాలని గుషిణి, పెద బూరాడపేట ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ సుధారాణి విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 9వ తరగతి వరకు స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, డీసీసీబీ ఉపాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఏపీ టూరిజమ్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత, తహసీల్దార్ కేవీ రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ నియంత్రించాలి

- ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏబీవీపీ నిరసన



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

విజయనగరం: కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి యాజమాన్యాలు చేస్తున్న ఫీజుల దోపిడీని నియంత్రించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రతినిధి రాజాన రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐఓ ఆదినారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఫీజు రెగ్యులేటరీ చట్టాన్ని తుంగలోకి తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఫీజుల నియంత్రణను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే అటువంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వంశీకుమార్, సాయికుమార్, వంశీ, తరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంఈఓ రాధాకృష్ణ

డెంకాడ: విద్యారంగానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను నాడు – నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ అట్టాడ భాస్కరరావు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో నూతన ఒరవడి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు చిత్రంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- 'జగనన్న సురక్ష'లో 11 రకాల ధ్రువపత్రాల జారీ
- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పాలనలో నూతన ఒరవడి అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) అన్నారు. నెల్లిమర్ల మండలం, నగర పంచాయతీకి చెందిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి అడ్డంకులు లేకుండా ప్రజలకు పూర్తిస్థాయిలో అందించడానికి సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను సచివాలయాల వద్దనే అందించడం జరుగుతుందన్నారు. దీని కోసం వలంటీర్లంతా వారికి కేటాయించిన 50 కుటుంబాలను సందర్శించాలని సూచించారు. వారికి అవసరమైన ధ్రువపత్రాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వలంటీర్లకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సూచించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లదే కీలక పాత్ర అన్నారు. అధికారులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేస్తే అనుకున్న ప్రయోజనాలను ప్రజలకు అందించవచ్చని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎస్ పెన్షన్ విధానం, ఆర్టీసీ విలీనం, 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కేటాయింపు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సీఎం ఘనత అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల, నగర పంచాయతీ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, దంతులూరి గిరిబాబు, రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, మజ్జి గణేశ్, తహసీల్దార్ కేవీ రమణరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

- ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్



కోట జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది



జీఆర్‌పీ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న రైల్వే ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఈబీ విజయనగరం –1 టౌన్ ఆధ్వర్యంలో బాబామెట్ట నుంచి కోట జంక్షన్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనేక వ్యసనాలలో మాదకద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమైనదన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలైన గంజాయి, హెరాయిన్ , కొకైన్, నల్లమందు వంటి వాటికి అలవాటు పడి వారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి హాని కలిగించే డ్రగ్స్ రవాణాపై సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈబీ టౌన్ సీఐ బి.మధుకుమార్, రూరల్ ఎస్సై కరుణలత, విముక్తి కేంద్రం డైరెక్టర్ ప్రసాద్, యువజనశాఖ, మహారాజా, సత్య కళాశాల ఎన్‌సీసీ స్టూడెంట్స్, సిబ్బంది ధనరాజు, రెడ్డి రమణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా..

రైళ్లలో గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని విశాఖ రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు అధికారులకు, సిబ్బందికి సూచించారు. జీఆర్‌పీ రైల్వేస్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. అనంతరం కంటోన్మెంట్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కాంచన, జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని పేరాపురం, వెంపడాం, తొత్తడాం, తాళ్లపేట గ్రామాలలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రచారం చేసినట్లు విజయనగరం కమిటీ సభ్యులు శంకరరావు, ప్రసాద్, రాజప్పడు, నాయుడు, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.